# పిల్లలు కొల్లలు

'పున్నామ నరకం నుండి తప్పించువాడు పుత్రుడు' - అనే పండిత నిర్వచనం ఆది కాలాల నుంచీ అనేకమైన పుత్రకామేష్ఠి యాగాలకి దారి తీసింది. అందుకనే పుత్రికల కోసం ప్రత్యేకంగా యాగాలు చేసినట్టు ఎక్కడా దాఖలాలు లేవు. వంశక్షయం కాకుండా వంశోద్ధారకులుండాలనీ, వృద్ధాప్యంలో ఆదుకునే పుత్రరత్నాలుండాలనీ ఆకాంక్షించే దంపతుల సంఖ్యతో పోలిస్తే, కూతురు కావాలని కొరుకునే దంపతుల సంఖ్య తక్కువ. అయితే కొడుకులకి కొడుకులు పుట్టాలంటే, కోడళ్ళనబడే స్త్రీల అవసరం ఉంటుంది. కాబట్టి ప్రకృతి దాదాపు కాస్త అటూ యిటూగా మగ శిశువుల్నీ, ఆడ శిశువుల్నీ సమానంగానే ప్రసాదిస్తూ ఉంటుంది.

మనదేశ వ్యవస్థకు సంబంధించినంత మేరకు పిల్లలకు దేవుడిచ్చిన వరాలు. '*శీఘ్రమేవ కళ్యాణ ప్రాప్తిరస్తు! పుత్ర పౌత్రాభివృద్ధిరస్తు!*' అనే ఆశీర్వచనాలు సర్వసాధారణాలు. 'ఆయురారోగ్య ఐశ్వర్యాభివృద్ధిరస్తు' అనే ఆశీర్వచనం ఫలించినా ఫలించకపోయినా పైన చెప్పిన రెండు ఆశీర్వచనాలూ పరమ దుర్మార్గులు చేసినా ఫలిస్తాయి.

కూడూ, గుడ్డా, గూడూ మానవుని ప్రాథమిక అవసరాలు. విద్యా, వాక్స్వాతంత్ర్యమూ, ముఖ్యంగా మనుగడా, మానవుని ప్రాథమిక హక్కులు. స్త్రీ పురుష సంగమమనేది ప్రాథమిక అవసరమా? హక్కా? అంటే, అది రెండూను! అది దేహానికి సంబంధించినది. పడగ్గదికి పరిమితమైనది. కాని పుట్టుకొచ్చిన సంతానం ఆ యింటికే పరిమితం కాదు. సమాజం మీదా, దేశం మీదా ఆ సంతానం ఎన్నో బరువు బాధ్యతల్ని పెంచుతుంది. 'నారు పోసిన వాడు నీరు పొయ్యడా' అనే వేదాంత ధోరణిలో పిల్లల్ని కంటూ పోతే, నీరు పొయ్యడానికి పక్కింటి నూతి నీరడిగినప్పుడు మొదలౌతాయి కష్టాలనేవి.

'దరిద్రులకి సంతానమెక్కువ' అని సామెత చెప్పుకొనే సమాజం, దారిద్ర్యానికి అధిక సంతానం కూడా ఒక కారణమని ఆలోచించదు. అయితే, శతకోటి దరిద్రాలకి అనంతకోటి ఉపాయాలున్నట్లుగా వ్యాపార సరళిలో లేదా వాణిజ్య ధోరణిలో సాగిపోయే నేటి ప్రపంచంలో, పిల్లల్ని అడ్డుపెట్టుకుని వారి ద్వారా నిర్దాక్షిణ్యమైన రీతులలోనూ, అమానుషమైన పద్ధతుల్లోనూ పొట్ట కూటికీ, ధనార్జనకీ అలవాటు పడిపోయిన వారెందరో ఉన్నారు. పిల్లల సహాయంతో 'ముష్టి' అనే వ్యాపారం మన దేశంలో చాలా అభివృద్ధి చెందుతోంది.

మా నాయనమ్మ చిన్నప్పుడు ప్రతి ఆదివారం మాకు రెండు పనులు పురమాయించేది. ఒకటి ఉదయమే ప్రొద్దెక్కకుండా సంతకి వెళ్ళి కూరలు తీసుకురావడం; ఆ తర్వాత రెండు కుంచాల బియ్యంతో వీధి అరుగు మీద కూర్చుని, వచ్చే ముష్టి వాళ్ళకి ముష్టి వెయ్యడం. ఆ వచ్చే వాళ్ళలో దుక్కగా ఉండేవాళ్ళూ, బక్కగా ఉండేవాళ్ళూ, అపాంగులూ, కుష్టు రోగులూ - ఒకరేమిటి, రకరకాల వాళ్ళుండేవాళ్ళు. ఆదివారం నాడు యాయవారం బ్రాహ్మడు వచ్చేవాడు కాదు. వచ్చినా దొడ్డిదారమ్మట యింట్లోకి వెళ్ళి మా నాయనమ్మ చేతుల్తో బియ్యాన్నందుకొనేవాడు. ఎందుకంటే అతను 'ముష్టివాళ్ళ'తో సమానం కాకూడదు. అలాగే గంగిరెద్దుల వాళ్ళూ, బుడబుక్కల వాళ్ళూ, కోయ దొరలూ గుప్పెళ్ళతో బియ్యం వేస్తే గుడ్లురిమి చూసేవారు. వాళ్ళకి పళ్ళాలతోటే

బియ్యం వెయ్యాలి.

అయితే వాళ్ళలో అధికభాగం స్త్రీలుండేవారు. చంకలో పిల్లాడు, కొంగు పట్టుకుని నడిచే పిల్లా, లేదా కాళ్ళని చుట్టుకొని నిల్చే పిల్లా - ఒక్కొక్కరు కనీసం ముగ్గురు నలుగురు పిల్లలతో వచ్చేవాళ్ళు. మొయ్యకలిగిన ప్రతి చిన్నారుల చేతుల్లోనూ అల్యూమినియం బొచ్చెలు. ప్రత్యేకంగా ఎవరి బొచ్చెలు వారికి లేనప్పుడు, ఇద్దరు పిల్లలతో వచ్చిన స్త్రీ మూడు గుప్పెళ్ళ బియ్యం, ముగ్గురు పిల్లలతో వచ్చిన స్త్రీ నాలుగు గుప్పెళ్ళ బియ్యం, దెబ్బలాడి మరీ, వేయించుకొనేవారు. ఒక్కోసారి అరగంటలో రెండోమారు మరో యిద్దరు పిల్లల్ని తీసుకువచ్చేవారు. తెలిసీ తెలియని వయసులో నాకప్పుడనిపించేది. 'దేవుడు ఈ ముష్టి వాళ్ళకెందుకు యింత మంది పిల్లల్నిస్తాడు?' అని.

ఒక్కోసారి ఆ గుంపుని అదుపులో పెట్టడం చాలా కష్టమైపోయేది. మూడో కుంచం అవసరమైనప్పుడు, నాయనమ్మ సర్ది వెయ్యడం నేర్చుకోవాలని మందలించేది. స్వర్గంలో ఉన్న మా తాతగార్ని కలుసుకునేందుకు నెలకు ఎనిమిది కుంచాల బియ్యం దానం చాలాని ఆవిడనుకొనేది కాబోలు, మాకేం తెలుసు?!

రాజమండ్రి కాలేజీలో కొత్తగ్గా చేరిన రోజులు. ఓ రోజు, గోదావరి స్టేషన్ దగ్గర పోస్టాఫీసు కెదురుగా గడ్డాలు, మీసాలూ ఉన్న ఓ వ్యక్తి, ఆరేడేళ్ళు వయస్సుగల యిద్దరు కుర్రవాళ్ళని రోడ్డు పక్కగా వేసిన గుడ్డ మీద పడుకోబెట్టి అడుక్కోవడం చూశాను. ఆ పిల్లలిద్దరి వంటి మీదా జుగుప్సాకరమైన పుళ్ళు. దారినపోయే దానయ్యలు అయిదు పైసలూ, పది పైసలూ విసురుస్తున్నారు. నేనూ ఓ పది పైసల నాణేం పడేశాను. అక్కణ్ణుంచి ఓ వంద అడుగుల దూరం వెళ్లిన తర్వాత, మునిసిపల్ పార్కుని ఆనుకొని అదే రకమైన దృశ్యం మళ్ళీ కనబడింది ఓ నడి వయస్సు స్త్రీ ఆక్రందనలు చేస్తోంది. నేల మీద పడుకోబెట్టిన ఓ అయిదారేళ్ళ అమ్మాయిని చూపిస్తూ, కాళ్ళ మీదా, చేతులు మీదా అవే రకమైన పుళ్ళు. నడుచుకొంటూ ముందుకుపోయాను కాని నాణెం విసరబుద్ధి వెయ్యలేదు. ఆ తర్వాత తెలిసింది. జిల్లేడు పాలనీ, పసుపునీ కలిపి పల్చటి దూదిపొర మీద వేసి వంటికి అంటిస్తారని. అంటే 'సింపతీ కార్డు' ప్లే చేసి జనాల్ని ఓ కానీ విసిరేటట్టు చేసుకోవడం.

వీళ్ళకన్నా మా వూరి ముష్టివాళ్ళే నయమనిపించింది. ఆ తర్వాత పేపర్లో చాలామార్లు చదివాను. పిల్లల్ని ఎత్తుకుపోయి లేదా పోషించలేని వాళ్ళమ్ముకున్న పిల్లల్ని తీసుకుపోయి, దౌర్జన్యంగా వాళ్ళని వికలాంగులు చేసి మహానగరాల వీధుల్లో ముష్టెత్తించే ముఠాలు చాలా తయారయ్యాయని. బొంబాయి నగర ముఠాలకన్నా రాజమండ్రి జిల్లేడు పాలు దగుల్బాజీలే నయమనిపించింది.

చాలా సంవత్సరాల క్రితం గౌహతీ నుంచి త్రివేండ్రం వెళ్ళే, వివేకానంద్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణం చేశాను, కలకత్తాలో మారకుండా రాజమండ్రి దాకా వెళ్ళవచ్చును కదా అని. ప్రతీ రెండేసీ గంటలకీ ఎవరో చిన్న కుర్రాళ్ళు రావడం చిన్న చీపుళ్ళతో కంపార్టుమెంట్‌ని ఓ పక్క నుంచి రెండో పక్కకి తుడవడం, ఆ తర్వాత వచ్చి చేతులు చాచడం. మరీ ముష్టి అడుక్కోకుండా, పాపం ఈ కుర్రవాళ్ళు డ్రైవర్లూ, కండక్టర్లూ లాగే షిఫ్టులు మారుతూ, కంపార్ట్‌మెంట్లు మారుతూ ఏదో కాస్త కష్టపడుతున్నారని జాలిపడి, పదీ పాతికా పైసలు ఓ అరడజను మంది దాకా ఇచ్చాను. గంట గంటకీ తుక్కెక్కణ్ణుంచి వస్తుందీ అంటే, మన ప్రయాణీకులకి కాల్చిన సిగరెట్

పీకల్నుంచి మసాలా సెనగలు తిన్న కాయితాల వరకూ, వేరుశనగ డొల్లల్నుంచి మిగిలిపోయిన పదార్థాల వరకూ సీట్ల మధ్య పడవేయడం లేదా సీట్ల కిందకి తోసివేయడం ఉగ్గుతో పెట్టిన విద్య.

ఇది దాదాపు ప్రతి ట్రైన్‌లోనూ జరుగుతోంది. పూర్వం పెద్ద పెద్ద రైల్వే జంక్షన్లలో కంపార్టుమెంట్లు తుడిచేవారు. టాయ్‌లెట్లు కడిగి కాస్త ఫినాయిలు చల్లేవారు. అయితే ప్రస్తుతం అటువంటివేమీ జరగటల్లేదు. కనీసం ఈ కుర్రాళ్లు ఏదో విధంగా కంపార్టుమెంట్లైనా తుడుస్తున్నారని, ప్రయాణీకులూ ఏదో తోచించి యిస్తున్నారు. రైల్వే అధికారులు కూడా నిమ్మకు నీరెత్తినట్టుగా ఊరుకొంటున్నారు – వాళ్ళు నియోగించిన వ్యక్తులతో ఆ పని చేయించే సామర్థ్యం లేక.

అభివృద్ధి అనేది అన్ని రంగాల్లోనూ ఉంటుంది. ఈ పై విషయంలో కూడా చాలా మార్పులు వచ్చాయి. ప్రయాణీకుల ఎదురు గుండానే కట్టుకొన్న చింకి చొక్కాని విప్పి దాంతోనే మీ కాళ్ళ మధ్యనున్న తుక్కు తుడిచి, పక్క కంపార్టుమెంట్‌లోకి కాదు కదా, పక్క వరసకి వెళ్ళేముందు చేతులు చాస్తున్నారు. మోర్ సింపతీ? మోర్ బిజినెస్ మైండెడ్! ఒకడు కంపార్ట్‌మెంట్ ఈ చివర్నుంచి ఆ చివరి వరకూ తుక్కు తుడిస్తే అదే తుక్కుని మరో కుర్రాడు మరింతసేపు తర్వాత అవతల పక్కనుంచి యివతల పక్కకు తుడుస్తున్నాడు. మోర్ ఎంటర్‌ప్రైజింగ్?

అటువంటి పిల్లల్లో, రైలు చక్రాల కింద పడి కాళ్ళూ, చేతులూ పోగొట్టుకొన్న వికలాంగులూ ఉన్నారు. ఎవరు బాధ్యులు? వాళ్ళని కన్న తల్లిదండ్రులదా? రైల్వేలదా? కనికరించి డబ్బులు పడేస్తున్న ప్రయాణీకులదా?

అదే వివేకానంద్ ఎక్స్‌ప్రెస్‌లో, 'బూట్ పాలిష్' అంటూ అరుస్తూ, ట్రైన్ ఆ చివర్నుంచి ఈ చివర వరకూ మాటి మాటికీ తిరుగుతూ గౌహతీ నుంచి త్రివేండ్రం వరకూ వెళ్ళే యిద్దరు పదేళ్ళ కుర్రవాళ్ళని కూడా చూశాను. వాళ్ళిద్దరూ బీహారుకి చెందిన వాళ్ళు. తల్లి దండ్రులు గౌహతిలో కూలీ నాలీ చేసుకొని బ్రతుకుతున్నారు. గౌహతీ నుంచి వెళ్ళిన వివేకానంద్ ఎక్స్‌ప్రెస్ తిరిగి త్రివేండ్రం నుంచి రావడానికి వారం రోజులు పడుతుంది. వాళ్ళు తిరిగి వచ్చిన తర్వాత వాళ్ళ బాబయ్య కొడుకులిద్దరూ, తర్వాత ట్రిప్‌లో వెడతారు. చదువుకోవలసిన చిన్న వయసులో దేశం ఒక కొస నుంచి మరో కొస వరకూ పొట్టకూటి కోసం ఆ కుర్రాళ్ళు బూట్ పాలిష్ చేసుకొంటూ ట్రైన్లలో తిరిగే పరిస్థితి ఎందుకు కలిగింది?

ఖాళీగా కూర్చుని ఏ పుస్తకమో చదువుతోన్నప్పుడు లేదా కులాసాగా సిగరెట్ కాలుస్తోన్నప్పుడు ఎవరైనా చెయ్యి చాస్తే పొమ్మనే ప్రయాణీకులు, కంపార్ట్‌మెంట్‌లోనో లేదా ప్లాట్‌ఫారాల మీదో ఏదో తింటున్నప్పుడు చెయ్యి చాచేవారిని చూస్తే, నూటికి కనీసం యిరవై మంది చేతిలో ఉన్నది యిచ్చేయడమో, పావలా బదులు అర్థ యివ్వడమో జరుగుతుంది. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ ప్లస్ అంటే AT + లాగ, ఇది AB + అంటే, ఎడ్వాన్స్‌డ్ బెగ్గింగ్ ప్లస్! మనో వైజ్ఞానిక దబాన్! తెలివిమీరడం అనేది ఒక చదువుకొన్న వాళ్ళ సొత్తే కాదు.

రత్నాచల్ ఎక్స్‌ప్రెస్‌లో ఏలూరు నుంచి విశాఖపట్నం వెడ్తున్నాను. పచ్చి బాలింత ఇంకా కనుగుడ్డైనా తెరవని రోజుల పసిపాపని ఓ చేటలో పెట్టుకొని, పక్కనే ఓ ఆరేళ్ళ కుర్రాడు, నాలుగేళ్ళ పాప నడుస్తుండగా, 'బాబా, పిల్లల తల్లిని. తిండానికి తిండి లేదు. దానం చేసి పుణ్యం కట్టుకోండి' అని అడుక్కుంటోంది. మెళ్ళో పసుపుతాడు, నుదుట కుంకుమ. వేసిన

వాళ్ళు వేశారు. అన్నవరం స్టేషన్లో బండి ఆగగానే పెట్టె దిగింది. నల్లటి బట్టలు కట్టుకొని దుక్క లాంటి ఓ మనిషి ఆమె దగ్గరకు వచ్చి 'ఎంత దొరికిందేమిటి?' అని చేటలోని డబ్బుల్ని నొల్లుకోసాగాడు. నాలుగేళ్ళ పాప, "నాన్నా కాళ్ళు లాగుతున్నాయి, ఏత్తుకోవూ?" అని మారాం చెయ్యసాగింది. కిటికీ పక్కన కూర్చుని అంతా చూసిన నాకు ఆ పిల్లల మీద జాలి, ఆ దంపతుల మీద కోపమూ కలిగిన మాట వాస్తవం.

పని మీద వెళ్ళి హిమాచల్ ప్రదేశ్‌లోని రామ్‌షహర్ నుంచి చండీఘర్ ఆఫీసు కార్లో తిరిగివస్తూ ప్రసిద్ధి చెందిన పింజోర్ గార్డెన్స్ దగ్గర ఆగాము నేనూ, నా జూనియర్ కొలీగ్ సంజయ్ గోవిల్. కారు దిగే ప్రయత్నంలో ఉండగా, ఓ పాతిక సంవత్సరాల వయసుగల యువతి ఓ పది నెలల పాపని చంకలో పెట్టుకొని, 'చంటిది పాల కోసం ఏడుస్తోంది. ఒకటి రెండు రూపాయలిచ్చి (ఏక్ దో రుపయా) పుణ్యం కట్టుకో'మంది. సంజయ్ 'జాజా' (పోపో) అన్నాడు. వెంటనే ఆమె కారు డోరు విండో దగ్గరగా వచ్చి పమిట దిగజార్చింది. జాకెట్‌కి గుండీలు లేవు. పయోధరాలు శుష్కించి ఉన్నాయి. జాలి మాట దేముడెరిగినా, చాలా యిబ్బందిగా ఫీలయ్యాం. సమయానికి చిల్లరా లేదు, చిన్న నోట్లూ లేవు. అయిదు నోటిచ్చి ఆమెని వదిలించుకొన్నాం. ఏ పరిస్థితులామెని ఆ స్థితికి దిగజార్చాయి?

ముంబయ్ బాంద్రా దగ్గర, మాహిమ్ కాజ్‌వే, వెస్ట్రన్ ఎక్స్‌ప్రెస్ హైవేల జంక్షన్ చాలా పెద్దది. ఒక్క నిముషంలో వందలాది కార్లు వెళ్ళే రోడ్లవి. ట్రాఫిక్ సిగ్నల్ ఎర్రగా మారినప్పుడల్లా రోడ్డు పక్కనున్న గుడిశెల్లోంచి అయిదు, పది సంవత్సరాల వయస్సులో ఉన్న బాలబాలికలూ, అరవైలూ డెబ్భైలూ దాటిన వృద్ధులూ కార్లని చుట్టుముట్టేస్తారు. 'కార్లలో తిరగే శ్రీమంతులు, ఒక రూపాయి దానం చేసుకోండి' అని నాటకీయంగా అడుగుతారు. కాళ్ళకి చెప్పులుండవు. నంటి మీద మాసి, చిరిగి, కంపు కొడ్తూన్న వస్త్రాలు. గ్రీన్ సిగ్నల్ వచ్చేలోగా వాళ్ళని వదిలించుకోవాలంటే పావలా అర్ధా యివ్వక తప్పదు. యివ్వకపోతే పక్కన నిల్చుని చూస్తున్న కొజ్జాలు వచ్చి కొరడా లాంటి మాటలు వదుల్తారు. పావలాతో వదిలేది రూపాయి దాటుతుంది. ఆ కుర్రాళ్ళకిచ్చే డబ్బులో ఆ కొజ్జాలకి వాటా ఉంటుంది.

అటు నేపాల్, బంగ్లాదేశ్‌ల నుంచి, యిటు మన దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి బాల బాలికల్ని దుర్భర దారిద్ర్యంతో అమ్మి వేయడమూ జరుగుతోంది. ఆ బాలబాలికలు అపహరింపబడడమూ జరుగుతోంది. ముక్కు పచ్చలారని బాలుర్ని మధ్యప్రాచ్యంలోని ఒంటెల పరుగు వినోద క్రీడల్లో అత్యంత దారుణంగా ఉపయోగించడం జరుగుతోంది. కాళ్ళూ చేతులూ కట్టి, ఒంటె మూపురాల మీద వేసి, ఆ ఒంటెలు పరుగులు తీస్తున్నప్పుడు భయవిహ్వలురై రోదన చేసే ఆ పిల్లల్ని చూసి ఆనందంతో కేకలు వేసే ప్రేక్షకుల్ని ఏమనాలి?

గచ్చకాయలూ, తొక్కుడు బిళ్లా ఆడుకొనే వయసులో ఉన్న ఆడపిల్లల్ని మహానగరాల నరక కూపాల్లోకితోసే పరమ కిరాతకులు ఎలా, ఎందుకు అవతరించినట్టు?

పదేళ్ళ పాపల్ని డబ్బుకాశపడి ముదుసలి షేక్‌లకు అమ్ముకొనే దౌర్భాగ్యస్థితి మన ఈ దేశాలకి ఎందుకు కలిగినట్టు?

ఈ విషయాలిలా ఉండగా, మన దేశంలో చాలా వ్యాపకాలు కులవృత్తులుగా పరిగణించబడడం అనాదిగా వస్తున్నదే. కుండలు చెయ్యడం, శిల్పాలు చెక్కడం, బట్టలూ, తివాచీలు నేయడం, నగిషీ పనులు చెయ్యడం వగైరా కులవృత్తుల్లో పసి వయసులోనే పిల్లలు

ప్రవేశించడం జరిగింది. ఇది కొంత వరకూ నికరమైన ఆదాయాన్ని కుటుంబాలకి కలుగచేస్తూ వచ్చింది. 'మరో రెండు చేతులుంటే ఇంకో ఇంత సంపాదించవచ్చు'నన్న భావన జనాభాని కొంత పెంచిన మాట వాస్తవం. కాని హద్దులు దాటిన తర్వాత, ఈ వ్యవస్థ కాలమాన పరిస్థితుల వల్ల దెబ్బతింది. యంత్రీకరణతో తగినంత పనిలేక, ముక్తసరి చదువులతో ఉద్యోగాలు రాక, ఈ తరహా ప్రజలు దేశమంతటా అష్టకష్టాలూ పడ్తున్నారు.

అహ్మదాబాద్‌లో కాని, గుజరాత్‌లోని ఇతర ముఖ్యపట్టణాల్లో కాని యిళ్ళలో పనిచేసేవాళ్ళలో. నూటికి అరవై శాతం రాజస్థాన్ నుంచి వచ్చిన పది పదిహేను సంవత్సరాల వయసులో ఉన్న కుర్రవాళ్ళు. వీళ్ళని 'రామా'లంటారు. ఎక్కడో నూటికీ కోటికీ తప్ప అందరూ నమ్మకస్తులు. పై అంతస్తు నుంచి డాబాకి వెళ్ళే మెట్ల మీది గూడు క్రింద వీరి నివాసం. ఒక్కొక్కరూ అయిదారిళ్ళలో పని చేస్తారు. వాళ్ళేదైనా పెడ్తే తింటారు. లేకపోతే నోరు విప్పి కూడా అడగరు. నెల చివర్న వచ్చే జీతాల్లో బహు స్వల్పం ఏ యింటి అమ్మ దగ్గరో దాచుకొని, మిగిలినదంతా యిళ్ళకి పంపిస్తారు.

బాల్య వివాహాలు ఇప్పటికీ రాజస్థాన్‌లో ముమ్మరంగా జరుగుతున్నాయనే దానికి నిదర్శనం ఈ 'రామా'లు వాళ్ళని చూస్తే జాలి వేస్తుంది. పసి వయసులో అర్థం తెలియని వివాహాలు. జన్మనిచ్చిన వారిని పోషించడానికీ, పొట్ట కూటికీ ఊరు విడిచి పరుగులు. విద్య కోసం చిన్నప్పట్నుంచి రెసిడెన్షియల్ పాఠశాలల్లో చేరే ధనిక వర్గపు పిల్లలూ, పొట్టకూటికి వందలాది కిలోమీటర్లు పోయి మెట్ల కింద నివసించే పిల్లలూ ఉన్న మన దేశం, నిజానికి చాలా అసంబద్ధతలకీ, వైరుధ్యాలకీ నిలయం.

అగ్గిపెట్టె ఫ్యాక్టరీల్లోనూ, బాణాసంచా ఫ్యాక్టరీల్లోనూ పనిచేసే బాల శ్రామికుల విషయమై మన దేశమే మౌనంగా ఊరుకొంటే, కులవృత్తి పరంగా బాల శ్రామికులచే నేయబడిన తివాచీలపై, లేదా చేయబడిన నగిషీ వస్తువులపై ఆంక్షలు విధించి, పాశ్చాత్య దేశాలు ధ్వజమెత్తుతున్నాయి! అదీ అంతే! యిదీ అంతే!

'పేదలు పిల్లల్ని కనకూడదు' అనే భావనతో ఈ మాటలు చెప్పబడట్లేదు. పెరుగుతున్న జనాభా పేదల్ని తయారుచేస్తుందని చెప్పడమే ముఖ్యోద్దేశ్యం.

'పిల్లల్ని కనడం మా ప్రాథమిక హక్కు వాళ్ళని పోషించే బాధ్యత సంఘానిదీ, ప్రభుత్వానిదీ' అన్న ధోరణి ప్రజలలో ఉన్నంతకాలం, జనాభా విస్తరిస్తూనే ఉంటుంది. పెరుగుతున్న జనాభాని ప్రభుత్వ ప్రణాళికలు ఆదుకోలేక నిర్వీర్యమైపోతుండగా, జనాలు ఎవరి దారి వారు చూసుకొంటున్నారు. వాదాలు వెర్రితలలు వేస్తున్నాయి.

పుట్టిన పిల్లలకి రెండు అక్షరం ముక్కలబ్బి, నాలుగు మెతుకులు దొరకాలంటే, సంసార సుఖం అనుభవిస్తోన్నప్పుడు కాస్త అడ్డుపెట్టుకోక తప్పదు. ఇది పిల్లల్ని కనే తల్లిదండ్రుల బాధ్యత. ప్రజల బాధ్యత. అలా చెయ్యకపోతే అది నేరం.

ప్రజల్ని ఈ విషయంలో వివేకమంతుల్ని చెయ్యడం, విజ్ఞుల బాధ్యత. ప్రభుత్వం బాధ్యత. 'నేటి బాల బాలికలు రేపటి పౌరులు' కావాలంటే, ప్రభుత్వం కుటుంబ నియంత్రణ విషయమై నిర్దిష్టంగా వ్యవహరించాలి. అయితే ప్రజాప్రతినిధులూ, దేశనాయకులూ 'ఈనాటి బాలబాలికలందరూ రేపటి ఓటర్లు!' అని నిర్లిప్తత వహిస్తే దేశం కుంటుబడక ఏంచేస్తుంది?